పోలీసు కిష్టయ్యకు నివాళి ..

పోలీసు కిష్టయ్య చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మున్సిపల్ చైర్మన్ అశోక్

పరిగి, డిసెంబర్ 1 : తెలంగాణ మలిదశ ఉద్యమ తొలి అమరుడు పోలీసు కానిస్టేబుల్ కిష్టయ్య ముదిరాజ్ 15వ వర్ధంతి సందర్భంగా ఆదివారం పరిగిలో ఆయన చిత్రపటానికి మున్సిపల్ చైర్మన్ ముకుంద అశోక్ పూలమాల వేసి నివాళులర్పించారు. అమరవీరుల త్యాగా లతో తెలంగాణ ఉద్యమం మరింత ఉవ్వెత్తున ఎగిసిపడిందన్నారు. నివాళులర్పించిన వారిలో మాజీ వైస్ ఎంపీపీ సత్యనారాయణ, వివిధ సంఘాల నాయకులు ముకుంద నాగేశ్వర్, పర్ష మోని బాబయ్య, బాబు, వెంకట్‌రెడ్డి, గోపాల్, ఆంజనేయులు, యాదయ్య, గట్యానాయక్, గోవింద్‌నాయక్, హరినాయక్, కావలి శ్రీశైలం, మంచన్‌పల్లి శ్రీనివాస్, వెంకటయ్య పాల్గొన్నారు.

నేషనల్ మాస్టర్స్ అథ్లెటిక్ అసోసియేషన్ పోటీలు

వివిధ పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులు

వికారాబాద్, డిసెంబర్1 : నేషనల్ మాస్టర్స్ అథ్లెటిక్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం వికారాబాద్ జిల్లా కేంద్రంలోని ఎస్ఏపీ కళాశాల గ్రౌండ్‌లో వివిధ పోటీలు నిర్వహించారు. వికారాబాద్, పరిగి, తాండూరు, కొడంగల్ ప్రాంతాల నుంచి అథ్లెట్స్ పాల్గొన్నారు. వాకింగ్, జంపింగ్, రన్నింగ్, త్రోబాల్ విభాగాల్లో మాస్టర్స్ పాల్గొన్నారు. విన్నర్స్ , రన్నర్స్ కు గోల్డ్, సిల్వర్ మెడల్స్ అందించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ మంజుల , మాస్టర్స్ అథ్లెటిక్ అసోసియేషన్ వికారాబాద్ జిల్లా అధ్యక్షుడు సత్తయ్య, ప్రధాన కార్యదర్శి అశోక్, ఎస్ఏపీ కళాశాల వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు గోవర్ధన్ రెడ్డి, కార్యదర్శి తస్పర్ అలీ, మాస్టర్స్ అథ్లెటిక్ అసోసియేషన్ సభ్యులు రాజారెడ్డి, శ్రీనివాస్, నారాయణ రావు, సంగమేశ్వర్, విజయ్, సత్యం, రాంచందర్, ప్రతాప్, నరేందర్, ప్రవీణ్, నరేశ్ పాల్గొన్నారు.

క్రీడాకారుల కోసం క్రికెట్ ప్రాక్టీస్ నెట్

పరిగి, డిసెంబర్ 1 : పరిగి మున్సిపాలిటీ పరిధిలోని సుల్తాన్‌నగర్ దర్గా గ్రౌండ్‌లో తన సొంత డబ్బులు రూ.30వేలతో ఏర్పాటు చేసిన క్రికెట్ ప్రాక్టీస్ నెట్‌ను ఆదివారం బీఆర్ఎస్ పట్టణ మాజీ అధ్యక్షుడు గౌస్‌పాషా ప్రారంభించారు. క్రికెట్ క్రీడాకారులను ప్రోత్సహించేందుకు ఈ ఏర్పాటు చేసినట్లు ఆయన పేర్కొన్నారు. అనంతరం గౌస్‌పాషాను క్రీడాకారులు సన్మానించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు ఫసియుద్దీన్, యూసుఫ్ పాల్గొన్నారు.

మేకల సంత ఏర్పాటుకు అనుమతి

బంట్వారం,డిసెంబర్ 1: మండల కేంద్రంలో మేకల సంత ఏర్పాటు అనుమతులు వచ్చాయని, మర్పల్లి మార్కెట్ కమిటీ డైరెక్టర్ యాదగిరి పేర్కొన్నారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ గత నెల మార్కెట్ కమిటీ సమావేశంలో చర్చించి మార్కెట్ కమిటీ చైర్మన్ మహేందర్‌రెడ్డి వెంటనే మండల కేంద్రంలో స్థల పరిశీలన చేసి, ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారన్నారు. దీంతో స్పీకర్ ప్రసాద్‌కుమార్ చొరవతో అనుమతులు వచ్చినట్లు తెలిపారు. త్వరలో మేకల సంత నిర్వహణకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. పరిసర గ్రామాల ప్రజలు మేకల సంతను సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ వైస్ చైర్మన్ సుధాకర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

టీఎస్ యూటీఎఫ్ జిల్లా మహాసభల ఆహ్వాన కమిటీ

పరిగి, డిసెంబర్ 1: ఈనెల 14వ తేదీన పరిగిలో జరిగే టీఎస్ యూటీఎఫ్ జిల్లా మహాసభల ఆహ్వాన కమిటీని ఏర్పాటు చేశారు. ఆదివారం పరిగిలో టీఎస్ యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు వెంకటరత్నం, రాములు, నిర్వహణ కమిటీ కన్వీనర్ జాఫర్‌పల్లి వెంకటయ్యల ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో జిల్లా మహాసభల ఆహ్వాన కమిటీ అధ్యక్షుడిగా సదానందం, ఉపాధ్యక్షుడిగా వెంకటయ్య, సభ్యులుగా వెంకట్‌రాములు, కరుణాకర్, అంజయ్య, మొగులయ్య, అనంతయ్య, మల్లేశం, శ్రీనివాస్, రఘురామ్, పెంటయ్య, అనిల్, నర్సమ్మ, రామకృష్ణలను ఎన్నుకున్నట్లు జిల్లా అధ్యక్షుడు తెలిపారు.

పలు చోట్ల ఆబ్కారీ రూట్‌వాచ్

పోలీసుల తనిఖీలు గమనించి పరారైన నిందితుడు

20.19 గంజాయి సహా కారు సీజ్

సిటీబ్యూరో, డిసెంబర్ 1 (నమస్తే తెలంగాణ): అక్రమంగా గంజాయి రవాణా జరుగుతున్నట్లు తెలుసుకున్న రంగారెడ్డి జిల్లా ఆబ్కారీ పోలీసులు నగరంలోని పలు ప్రాంతాల్లో ఆదివారం రూట్‌వాచ్ నిర్వహించారు. ఈ తనిఖీల్లో గంజాయి తరలిస్తున్న వ్యక్తి ఆబ్కారీ పోలీసులను గమనించి కారును వదిలి పరార్యా డు. శంషాబాద్ డీటీఎఫ్ సీఐ ప్రవీణ్‌కుమార్ కథనం ప్రకారం ...ఒడిశా మల్కాన్‌గిరి ప్రాంతానికి చెందిన బిక్రం హీరా ఒడిశా నుంచి గంజాయిని నగరానికి రవాణా చేస్తుంటాడు. శనివారం రాత్రి కారులో గంజాయి తరలిస్తుండగా విశ్వసనీయ సమాచారం అందుకున్న శంషాబాద్, సరూర్‌నగర్ డీటీఎఫ్ పోలీసులు శేరిలింగంపల్లి ఆబ్కారీ పోలీసులతో కలిసి గచ్చిబౌలి, రాయదుర్గం-నానక్‌రామ్‌గూడ రోడ్, ఖాజాగూడ సర్కిల్, మీనాక్షి అపార్ట్‌మెంట్స్, తదితర ప్రాంతాల్లో రూట్‌వాచ్ నిర్వహించి వాహనాలను తనిఖీ చేశారు. ఆబ్కారీ పోలీసుల తనిఖీలను గమనించి బిక్రం హీరా ఖాజాగూడ సర్కిల్ వద్ద గంజాయి రవాణా చేస్తున్న కారును వదిలి అక్కడి నుంచి పరారయ్యాడు. ఈ మేరకు ఆబ్కారీ పోలీసులు కారులో ఉన్న 20.19కిలోల గంజాయితో పాటు కారును స్వాధీనం చేసుకుని సీజ్ చేశారు. రంగారెడ్డి జిల్లా డిప్యూటీ కమిషనర్ దశరథ్, శంషాబాద్ ఈఎస్ కృష్ణప్రియ ఆదేశాల మేరకు జరిపిన ఈ తనిఖీల్లో శంషాబాద్ డీటీఎఫ్ సీఐ ప్రవీణ్‌కుమార్, ఎస్ఐ శ్రీకాంత్‌రెడ్డి, సరూర్‌నగర్ డీటీఎఫ్ ఎస్ఐ శంకర్, శేరిలింగంపల్లి ఎస్ఐ మొగులప్ప పాల్గొన్నారు.

నకిలీ బెయిల్ పత్రాలతో రిమాండ్ ఖైదీ విడుదల

నాంపల్లి క్రిమినల్ కోర్టులు, డిసెంబర్ 1 (నమస్తే తెలంగాణ) : నకిలీ బెయిల్ పత్రాలతో చంచల్‌గూడ జైలులో రిమాండ్ ఖైదీగా కొనసాగుతున్న సుజాత్ అలీఖాన్ జైలు నుంచి విడుదల య్యాడు. ఆలస్యంగా ఈ ఘటన వెలుగులోకి వచ్చింది. నవంబర్ 2న నార్సింగ్ పోలీస్ స్టేషన్‌లో అతడిపై పలు కేసులు నమోదు కాగా అరెస్టు చేసి జైలుకు పంపించారు. అయితే..రాజేంద్రనగర్ కోర్టు నుంచి నిందితుడిని విడుదల చేయాలని ఉత్తర్వులు జారీ అయినట్టు విడుదల పత్రాలను సుజాత్ అలీఖాన్ సంబంధీకులు జైలు అధికారులకు అందజేశారు. నవంబర్ 26న రెండో కేసు లోనూ బెయిలు మంజూరు కావడంతో జైలుకు విడుదల పత్రం అందడంతో నిందితుడిని విడుదల చేశారు. కానీ, అన్‌లైన్లో మాత్రం విడుదల పత్రాలు జైలుకు అందకపోవడంతో అధికారులు విచారణ చేపట్టారు. నిందితుడికి సంబంధించిన వారెంట్లు తనిఖీ చేయగా జైలుకు అందిన విడుదల పత్రాలు నకిలీవని తేలాయి. జైలు అధికారులు పూర్తి స్థాయిలో విచారణ చేపడుతున్నారు.

ఘనంగా పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



మర్పల్లి, డిసెంబర్ 1: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2005-06 సంవత్సరంలో పదో తరగతి చదివిన విద్యార్థులు ఆదివారం ఆ పాఠశాలలో అప్పటి ఉపాధ్యాయులతో కలిసి ఆత్మీయ సమ్మేళనాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకొని బాగోగులు తెలుసుకున్నారు. అప్పటి జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. ఈ సందర్భంగా అప్పటి ఉపాధ్యాయులు ఆనందం, దుర్గమణి, సూర్యభవాని, లక్ష్మణ్‌లను సన్మానించారు.

సీసీ కెమెరాలపై అవగాహన కల్పించాలి

కులకచర్ల, డిసెంబర్ 1 : సీసీ కెమెరాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని పరిగి సీఐ శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ఆదివారం కులకచర్ల పోలీస్ స్టేషన్‌లో రికార్డులను పరిశీలించి పోలీసు సిబ్బందితో మాట్లాడారు. గ్రామాల్లో సీసీ కెమెరాలపై ప్రజలకు పూర్తి స్థాయిలో అవగాహన కల్పించి అన్ని గ్రామాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకునే విధంగా ప్రోత్సహించాలన్నారు. ఉన్న సీసీ కెమెరాలను బాగు చేయించే విధంగా చూడాలన్నారు. కులకచర్ల మండలానికి వచ్చిన ముగ్గురు ట్రైనీ ఎస్ఐలకు పలు సూచనలు ఇచ్చారు. గ్రామాల్లో విలేజ్ పోలీస్ అధికారి నిర్వహించాల్సిన విధుల గురించి వివరించారు. గ్రామాల్లో సమస్యలను పరిష్కరించేందుకు విలేజ్ పోలీస్ అధికారి తగిన పాత్ర పోషించాలని సూచించారు. గ్రామాల్లో యువత గేమింగ్ బారిన పడకుండా చూడాలని, గంజాయి, అక్రమ ఇసుక రవాణాను అరికట్టాలని సూచించారు. పీడీఎస్ రైస్‌ను అక్రమంగా తరలిస్తే చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ అన్వేశ్‌రెడ్డి, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



సిబ్బందితో మాట్లాడుతున్న పరిగి సీఐ శ్రీనివాస్‌రెడ్డి

మాలల సింహగర్జనకు తరలిన నేతలు

మాలల సింహగర్జనకు పరిగి నుంచి తరలివెళ్తున్న నాయకులు

వికారాబాద్ నుంచి వెళుతున్న మాలమహానాడు సంఘం సభ్యులు

పరిగి, డిసెంబర్ 1: హైదరాబాద్‌లోని పరేడ్‌గ్రౌండ్‌లో ఆదివారం జరిగిన మాలల సింహగర్జన సభకు పరిగి నుంచి పెద్ద ఎత్తున మాల మహానాడు నాయకులు, కార్యకర్తలు తరలివెళ్లారు. మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు సుల్తాన్‌పూర్ వెంకటయ్య ఆధ్వర్యంలో పరిగిలోని కొడంగల్ క్రాస్‌రోడ్డులో జ్యోతిరావు పూలే విగ్రహానికి పూలమాల వేసి అంబేద్కర్ విగ్రహం వరకు ర్యాలీగా వెళ్లి, అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ప్రభుత్వాలు మాలలను తక్కువ చేసి చూస్తుండడంతో ఆత్మగౌరవ పోరాటం చేస్తున్నామని జిల్లా అధ్యక్షుడు వెంకటయ్య పేర్కొన్నారు. సింహగర్జనతో తమ సత్తా చాటనున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో అంబేద్కర్ విజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షుడు ముత్యప్ప, ప్రధాన కార్యదర్శి మంచన్‌పల్లి శ్రీనివాస్, మాల మహానాడు నియోజకవర్గ అధ్యక్షుడు విజయ్, నాయకులు విజయ్, కోళ్ల యాదయ్య, నర్సింలు, మాటుగూడెం వెంకటయ్య, బాలకృష్ణ, మాజీ ఎంపీపీ వెంకటయ్య, యాదయ్య పాల్గొన్నారు.

వికారాబాద్: వికారాబాద్ జిల్లా కేంద్రం మాలల సంఘం సభ్యులు భారీ ఎత్తున తరలి వెళ్లారు. జిల్లా మాల మహానాడు అధ్యక్షుడు చౌడాపూర్ వెంకటేశ్ వికారాబాద్ జిల్లా కేంద్రంలో జెండా ఊపి కార్యక్రమాన్ని ప్రారంభించారు. వికారాబాద్, తాండూరు, కొడంగల్, పరిగి నియోజక వర్గాలలోని వివిధ మండలాలు, మారుమూల గ్రామాల నుంచి భారీ ఎత్తున బయలుదేరారన్నారు. కార్యక్రమంలో జిల్లా మాల మహానాడు ప్రధాన కార్యదర్శి ఎంకెపల్లి శ్రీనివాస్, అధికార ప్రతినిధి ఆర్ రాములు, జిల్లా సలహాదారులు కె అనంత రాములు, జిల్లా సలహా దారులు వసంత్ కుమార్ , జిల్లా కో సలహాదారులు అంజిలయ్య, సోషల్ మీడియా ఇన్‌చార్జి ఎల్ శ్రీని వాస్, పెద్ది అంజి, కె ఈశ్వర్, జ్ఞానేశ్వర్, ధారూర్ వెంకటేశ్ , గోపాల్, పూల శ్రీను వివిధ నియోజక వర్గాల మండలాల అధ్యక్ష కార్యద ర్శులు, ఉద్యోగ సంఘాల నాయకులు, వికారాబాద్ జిల్లా మాల మహానాడు నాయకులు పాల్గొన్నారు.

పరిగి, డిసెంబర్ 1 : పరిగి పట్టణంలోని బాలసదనం విద్యార్థినులకు ఆదివారం జడ్పీహెచ్ఎస్ నెం.2 2002-03 పదో తరగతి పూర్వ విద్యార్థులు దుప్పట్లు, పండ్లు పంపిణీ చేశారు. పూర్వ విద్యార్థుల నేతృత్వంలో మరిన్ని సామాజిక సేవా కార్యక్రమాలు చేపడతామని చెప్పారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు, బాలసదనం సిబ్బంది పాల్గొన్నారు.

యాలాల, డిసెంబర్1: ఎయిడ్స్ దినాన్ని పురస్కరించుకొని తాండూరు పట్టణంలో టేక్ రైట్ పాత్ నినాదంతో ఆదివారం డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్ డా. రవీంద్ర యాదవ్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... అప్రమత్తతతోనే ఎయిడ్స్‌ను నివారించవచ్చాన్నారు. ఎయిడ్స్ నివారణకు త్వరలోనే కొత్త టీకాలు వచ్చే అవకాశం ఉందన్నారు.

గంజాయి స్వాధీనం..నిందితుడి అరెస్ట్

వికారాబాద్, డిసెంబర్ 1: గంజాయి అమ్ముతున్న వ్యక్తిని జిల్లా ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు పట్టుకున్నారు. ఎస్సైజ్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం...జిల్లా మధ్య నిషేధ , ఆబ్కారీ అధికారి విజయభాస్కర్ ఆదేశాల మేరకు అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో శని వారం వికారాబాద్ రైల్వే హాస్పిటల్ దగ్గర ఒక వ్యక్తి గంజాయి రవాణా, అమ్మకాలు చేస్తున్నాడు. జిల్లా ఎక్సైజ్ టాస్క్ ఫోర్స్ బృందం , ఎస్‌హెచ్‌వో వికారాబాద్ బృందాలు దాడులు నిర్వహించారు. ఈ దాడులలో ఎండి. అఖిల్ పాషా , లింగంపల్లి హైదరాబాద్‌కు చెందిన వ్యక్తి ని తనిఖీ చేయగా అతని దగ్గర 210 గ్రాముల ఎండు గంజాయి లభించిందన్నారు. ఆ వ్యక్తిని అరెస్టు చేసి రిమాండ్ కు తరలించినట్లు జిల్లా టాస్క్ ఫోర్స్ శ్రీనివాస్ తెలిపారు. ఈ దాడుల్లో వికారాబాద్ సీఐ రాఘవీణ, ఎస్సైలు ప్రేమ్ కుమార్ రెడ్డి, శ్రీనివాస్, సిబ్బంది విష్ణువర్ధన్ రెడ్డి, హనుమంతు, శివ ప్రసాద్, దస్తగిరి పాల్గొన్నారు.



కొడంగల్ డిసెంబర్ 1: మున్సిపల్ పరిధిలోని గుండ్లకుంట గ్రామంలోని అనాథ విద్యార్థి నవీన్‌కు అమ్మానాన్న, కొడంగల్ సోషల్ సర్వీస్ ఫౌండేషన్‌ల ఆధ్వర్యంలో చేయూతను అందించారు. ఆదివారం చిన్నారి విద్యార్థికి ఫౌండేషన్ సభ్యులు కిరాణ సరుకులతో పాటు నూతన దుస్తువులను అందించారు. కార్యక్రమంలో ఫౌండేషన్ ఫౌండర్ ప్రవీణ్‌కుమార్ పాల్గొన్నారు.

చదివింది పదోతరగతి.. మోసాలు కోట్లలో ..

తృతీయ జ్యువెలరీ అధినేత కాంతిదత్‌కు రిమాండ్

అతడిపై హిట్ అండ్ రన్ తోసహా పలు కేసులు

బంజారాహిల్స్, డిసెంబర్ 1: చదివింది పదో తరగతి.. ఆకట్టుకునే రూపం.. అనర్గళంగా ఇంగ్లీష్‌లో మాటలు.. ఇంటర్నేషనల్ బిజినెస్ అంశాలపై అవగాహన.. వీటినే పెట్టుబడిగా పెట్టి టాలీవుడ్ నుంచి బాలీవుడ్ దాకా అనేక మంది సెలబ్రిటీలను మోసం చేసి.. ఫోర్జరీ కేసులో అడ్డంగా దొరికిపోయిన తృతీయ జ్యువెలరీ సంస్థ అధినేత కాంతిదత్ తోనంగిని జూబ్లీహిల్స్ పోలీసులు అరెస్ట్ చేశారు. ఆదివారం కోర్టులో హాజరుపర్చగా 14రోజుల రిమాండ్ విధించడంతో జైలుకు తరలించారు. పోలీసుల వివరాల ప్రకారం.. విశాఖపట్నంలోని ఓ ప్రైవేటు పాఠశాలలో పదో తరగతి చదువుతూ మధ్యలోనే ఆపేసిన కాంతిదత్ తోనంగి(24) కుటుంబ సభ్యులతో కలిసి నగరానికి వచ్చాడు. వచ్చినప్పటినుంచే తనకున్న ఆంగ్లభాషా ప్రావీణ్యాన్ని ఉపయోగించుకుంటూ బిజినెస్ మ్యాగజైన్లతోపాటు వ్యాపార సంబంధమైన అంశాల పై ఆసక్తిని పెంచుకున్నాడు. 17ఏండ్ల వయస్సులోనే స్పార్టన్ మీడియా పేరుతో ఈవెంట్ మేనేజ్‌మెంట్ సంస్థను ఏర్పాటు చేసి.. 2019లో శిల్పకళా వేదికలో ఓ భారీ కార్యక్రమాన్ని నిర్వహించాడు. ఆ ఈవెంట్‌లో శిల్పారెడ్డి అనే ప్రముఖ డిజైనర్‌తో పరిచయం పెంచుకుని ఏడాదిన్నర క్రితం బంజారాహిల్స్ రోడ్ నం. 12, ఎమ్మెల్యే కాలనీ రోడ్డులో సస్టెయిన్ కార్ట్ అనే ఈ కామర్స్ ఫ్లాట్‌ఫారమ్ ఏర్పాటు చేశా డు. ఈ క్రమంలో అనేకమంది సెలబ్రిటీలతో పరిచయాలు ఏర్పరుచుకుని.. వారికి షేర్లు ఇస్తామంటూ మోసాలు చేయడం ప్రారంభించాడు. ఇదే క్రమంలో నగరానికి చెందిన తిప్పాల శ్రీజ అనే మహిళా వ్యాపారవేత్తతో పరిచయం పెంచుకుని, ఆమెతో కలిసి జూబ్లీహిల్స్ రోడ్ నం. 36లో తృతీయ జ్యువెలర్స్ సంస్థను ప్రారంభించాడు. రూ.2.50కోట్లు తీసుకుని మోసం చేయడంతో పాటు ఆమె సంతకాలను ఫోర్జరీ చేసి ఆమెను డైరెక్టర్‌గా తొలగించాడు. ఈ మేరకు బాధితురాలి ఫిర్యాదుతో పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేసిన జూబ్లీహిల్స్ పోలీసులు కాంతిదత్‌ను అరెస్ట్ చేసి ఆదివారం రిమాండ్‌కు తరలించారు. కాగా.. అరెస్టయిన కాంతిదత్ గతంలో తృతీయ జ్యువెలర్స్‌లో పెట్టుబడి పేరుతో ఖాతార్‌కు చెందిన ఎన్ఆర్ఐ వ్యాపారవేత్త ప్రవీణ్‌కుమార్‌ను రూ.6కోట్లు మోసం చేయడంతో నవంబర్ 15న సీసీఎస్‌లో చీటింగ్ కేసు నమోదయినట్లు విచారణలో తేలింది. దీంతో పాటు కాంతిదత్ మీద మాదాపూర్ పీఎస్‌లో హిట్ అండ్ రన్ కేసు సైతం నమోదయిందని తెలిసింది. జూలై 14న కొండాపూర్ నుంచి హైటెక్ సిటీవైపు వస్తున్న బంజారాహిల్స్‌కు చెందిన రాపిడో బైక్ డ్రైవర్ రాజశేఖర్‌ను తన బెంజ్‌కారుతో డీకొట్టడంతో రెండ్రోజుల తర్వాత చికిత్స పొందుతూ అతను మృతిచెందినట్లు తేలింది. యాక్సిడెంట్ తర్వాత కనీసం కారు ఆపకుండా వెళ్లిపోవడంతో ఓ యువకుడు వీడియో తీసి నెలరోజుల తర్వాత మృతుడి కుటుంబ సభ్యులకు పంపించడంతో ఈ వ్యవహారంపై కేసు నమోదయినట్లు పోలీసుల విచారణలో తేలింది. దీంతో పాటు జూబ్లీహిల్స్ రోడ్ నం .25లోని నయోమీ రెస్టారెంట్ వ్యవహారంలో కూడా కాంతిదత్ మీద ఫోర్జరీ కేసు నమోదయినట్లు విచారణలో వెల్లడయింది. కాంతిదత్ బాధితుల్లో హీరోయిన్ కాజల్ అగర్వాల్, కీర్తిసురేశ్, డిజైనర్ శిల్పారెడ్డి , తదితరులు ఉన్నారని వెల్లడయింది.

నిందితుడు కాంతిదత్ తోనంగి

బీబీ స్పెషల్ క్వాలిటీ పత్తికి

రూ.7471

మార్కెట్ కమిటీ కార్యదర్శి

పరిగి, డిసెంబర్ 1: కొన్ని రోజులుగా పత్తి స్టేబుల్ లెంత్ తగ్గుతున్నందున, సీసీఐ వారు క్వాలిటీ చెక్ ద్వారా నిర్ధారించారని, ఈనెల 2వ తేదీ నుంచి కొనుగోలు చేసే పత్తిని క్వాలిటీ బీబీ స్పెషల్‌గా పరిగణించి క్వింటాలుకు మద్దతు ధర రూ.7471 చెల్లించనున్నట్లు పరిగి వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యదర్శి విజయ్‌కిశోర్ ఒక ప్రకటనలో తెలిపారు. పరిగి వ్యవసాయ మార్కెట్ కమిటీ పరిధిలోని మూడు జిన్నింగ్ మిల్లుల్లో పత్తి కొనుగోలు జరుగుతుందని, స్టేబుల్ లెంత్ ఆధారంగా పత్తి నాణ్యతను బీబీ మోడల్, బీబీ స్పెషల్, మెక్ మోడగా సీసీఐ వారు విభజించారన్నారు. పత్తి స్టేబుల్ లెంత్ తగ్గుతున్నందున బీబీ స్పెషల్‌గా నిర్ధారించి క్వింటాలుకు రూ. 7471 చెల్లించనున్నట్లు పేర్కొన్నారు.

బహిరంగ ప్రకటన

నా క్లయింట్ **శ్రీ ధనుంజయ రెడ్డి బావిగడ్డ, తండ్రి రామచంద్రా రెడ్డి**, నివాసం: 82SP 1-64/4/2, రోడ్ నం. 5, రాజ్ రంజిత్ ప్రైమ్ హోమ్స్, మస్కతి డెయిరీ వెనుక, తుక్కుయాంజాల్, రంగారెడ్డి జిల్లా వారు నల్గొండ జిల్లా, మర్రిగూడ మండలం, ఖుదాబక్ష్‌పల్లి రెవెన్యూ గ్రామంలోని సర్వే నం. 83/ఆ/1/2, విస్తీర్ణం ఎ.1-00 గుంటలు, **ఉత్తరం:** డొంక, **దక్షిణం:** మిద్దె కొండయ్య భూమి, **తూర్పు:** B. సత్తయ్య భూమి మరియు **పశ్చిమం:** డొంక హద్దులుగా గల మొత్తం వ్యవసాయ భూమిని కొనుగోలు చేయుట కొరకు శ్రీ బిచ్చల శ్రీరాములు తండ్రి పాండయ్య, నివాసం: ఇం.నం. 1-33, BC కాలనీ, ఖుదాబక్ష్‌పల్లి గ్రామం, మర్రిగూడ మండలం, నల్గొండ జిల్లా వారితో ఉప-అమ్మక ఒప్పందం కుదుర్చుకున్నారని మరియు అడ్వాన్స్‌గా అగ్రిమెంట్ హోల్డర్‌కు తగినంత మొత్తాన్ని చెల్లించారని ఇందుమూలంగా సాధారణ ప్రజలకు తెలియజేయడమైనది. **శ్రీ బిచ్చల శ్రీరాములు క్రమంగా సదరు ఆస్తి యజమాని అయిన శ్రీమతి నేతి రాజేశ్వరి భర్త నేతి రవికుమార్, నివాసం: ఇం.నం. 2-3-603/49/98/3, పటేల్‌నగర్ దగ్గర, అంబర్‌పేట్, హైదరాబాద్** వారితో అమ్మక ఒప్పందం కుదుర్చుకున్నారు. ఎవరైనా వ్యక్తి/ వ్యక్తులకు, బ్రాంచ్ ఇన్‌స్టిట్యూషన్‌లకు ఏదైనా క్లెయిమ్, హక్కు, టైటిల్, ప్రయోజనం, అభ్యంతరాలు ఉంటే దిగువ ఇచ్చిన నా ఆఫీస్ చిరునామాలో ఈ నోటీసు తేదీ నుండి ఏడు రోజులలోగా అన్ని సంబంధిత ఒరిజినల్ డాక్యుమెంట్లతో పాటు తమ అభ్యంతరాలు దాఖలు చేయవలసిందిగా ఇందుమూలంగా నోటీసు ఇవ్వడమైనది. లేనిో నా క్లయింట్ అమ్మక వ్యవహారం పూర్తిచేస్తారు మరియు సేల్ డీడ్ రిజిస్టర్ చేయించుకుంటారు మరియు ఆ తరువాత ఎవరైన వ్యక్తి తెలిపే ఏ అభ్యంతరమైనా చెల్లుబాటుకాదు.

సం/- K. రమాదేవి, అడ్వకేట్
P.No.92, H.No. 8-46, మైత్రీపురం, కర్మన్‌ఘాట్, రంగారెడ్డి జిల్లా. ఫోన్: **9849547093.**

విదేశీయురాలి వ్యభిచార దందా..

టాస్క్‌ఫోర్స్ పోలీసుల దాడి - ముగ్గురు అరెస్ట్

సిటీబ్యూరో, డిసెంబర్ 1 (నమస్తే తెలంగాణ): హైదరాబాద్‌లో విదేశస్థురాలు వ్యభిచార గృహాన్ని నిర్వహిస్తూ నార్త్‌జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులకు పట్టుబడింది. లోకంటో యాప్‌ను అడ్డాగా చేసుకొని తన దేశస్థురాలినే సబ్ ఆర్గనైజర్‌గా పెట్టి ఈ దందాను నిర్వహిస్తున్నట్లు పోలీసుల విచారణలో వెల్లడయ్యింది. టాస్క్‌ఫోర్స్ డీసీపీ సుదీంద్ర కథనం ప్రకారం.. ఉగాండకు చెందిన నయాబేర్ డొరీన్ హైదరాబాద్‌కు వచ్చి తర్నాకలోని నాగార్జుననగర్‌లో ఒక ఇంటిని అద్దెకు తీసుకుంది. తమ దేశానికి చెందిన కుమాంఘి రిత్తను సబ్ ఆర్గనైజర్‌గా పెట్టుకుని దందా నడిస్తున్నది. లోకంటో యాప్‌లో సెల్‌నంబర్‌ను అప్‌లోడ్ చేసి.. విటులు ఆ నంబర్‌తో చాటింగ్ చేయడంతో లొకేషన్ ముందుగా సికింద్రాబాద్ అంటూ షేర్ చేస్తారు. కస్టమర్ సికింద్రాబాద్ వచ్చిన తరువాత బ్రోతల్ హౌస్ లొకేషన్‌ను షేర్ చేస్తారు. ఎవరికి అనుమానం రాకుండా ఇద్దరే అక్కడ ఉంటూ ఒకసారి స్టడీ వీసాపై వచ్చామని, మరోసారి బిజినెస్ వీసాపై వచ్చామని స్థానికులు ఎవరైనా అడిగినప్పుడు చెబుతుంటారు. లోకంటో అడ్డగా నగరంలో వ్యభిచారం జరుగుతుందని సమాచారం అందుకున్న నార్త్‌జోన్ టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ కె.సైదులు బృందం ఉస్మానియా యూనివర్సిటీ పోలీసుల సహకారంతో బ్రోతల్ హౌస్‌పై దాడి చేసి నిర్వాహకురాలు, సబ్ నిర్వాహకురాలితో పాటు విటుడు ఉప్పల్‌కు చెందిన పొట్టూరి అంజన్‌కుమార్‌ను అరెస్ట్ చేశారు.

ఆటో డ్రైవర్ల సమస్యలు పరిష్కరించాలి

చర్లపల్లి, డిసెంబర్ 1 : వచ్చే అసెంబ్లీ సమావేశంలో ఆటో డ్రైవర్ల సమస్యలను పరిష్కరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని బీఆర్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు వేముల మారయ్య కోరారు. కాప్రా సర్కిల్ హెచ్ఎంటీ నగర్, నాచారంలోని బీఆర్‌టీయూ గ్రేటర్ కార్యాలయంలో ఈ నెల 7న రాష్ట్ర వ్యాప్తంగా ఆటో జేఏసీ ఆధ్వర్యంలో నిర్వహించనున్న ఆటో బంద్‌కు సంబంధించి గోడ పత్రికను టీఏడీఎస్ రాష్ట్ర కార్యదర్శి సత్తిరెడ్డి, టీయూసీఐ గ్రేటర్ గౌరవ అధ్యక్షుడు లింగం గౌడ్, శాతం రమేశ్, హైమ్మద్‌లతో కలిసి ఆయన ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర వ్యాప్తంగా ఆటో డ్రైవర్ల సంక్షేమానికి ప్రభుత్వం తగు చర్యలు తీసుకోవాలని, కాంగ్రెస్ ప్రభుత్వం గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరారు. వచ్చే అసెంబ